నిధులు ఎగ్గొట్టి.. బడులను గాలికొదిలేసి..

కూటమి ప్రభుత్వ నిర్వాకంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్కారు బడుల నిర్వహణకు నిధులివ్వకుండా గాలికొదిలేసింది. దీంతో ఆ భారం హెచ్‌ఎంలపై పడింది. ఎన్నికల సమయంలో ఎన్నో ప్రగల్భాలు పలికిన కూటమి పెద్దలు నేడు పాఠశాలలను పట్టించుకోవడం మానేశారు.

- కూటమి ప్రభుత్వం నిర్వాకం
- విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విడుదల కాని నిధులు
- చాక్‌పీస్, డస్టర్లకు ఇబ్బందులు
- ప్రధానోపాధ్యాయులకు తప్పని తిప్పలు



ఆరవీడు ప్రాథమిక పాఠశాల (ఫైల్)

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ హయాంలో నాడు – నేడుతో బడుల రూపురేఖలు మారిపోయాయి. విద్యా రంగంపై నాటి ప్రభుత్వం శ్రద్ధ పెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పాఠశాలల పరిస్థితి చతికిలపడేలా ఉంది. బడుల నిర్వహణను గాలికొదిలేయడంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ నిధులు (కాంపోజిట్ గ్రాంట్) మంజూరు చేయక పోవడంతో చిన్న సమస్యలు సైతం పరిష్కారం కావడంలేదు. బోర్డుపై రాసేందుకు చాక్‌పీస్‌లు లేవు. రాసిన అక్షరాలు తుడిపేందుకు డస్టర్లు కరువే. అదే క్రమంలో మరుగుదొడ్ల శుభ్రం చేసేందుకు యాసిడ్ లేదు. విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితులున్నాయి. దీంతో ఆయా పాఠశాలల్లో పరిస్థితులు అధ్వానంగా మారుతున్నాయి.

ప్రారంభమైనా..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మండల స్థాయి పాఠశాలల నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం నిధులు విడుదల చేస్తుంటారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి కాంపోజిట్ నిధులు రాకపోవడంతో ప్రధానోపాధ్యాయులు నాలుగు నెలలుగా ఇబ్బందులు పడుతూ అప్పోసొప్పో చేసి పాఠశాలలను నిర్వహిస్తున్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో ఆరు మండలాలు, మున్సిపాలిటీలో కలిపి సుమారు 30 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. చాక్‌పీస్‌లు, డస్టర్లు సైతం కొనుగోలు చేసేందుకు నిధుల్లేవని హెచ్‌ఎంలు వాపోతున్నారు. సుద్ద ముక్క నుంచి ఫ్యాన్లు, లైట్ల రిపేర్ల వరకు అంతా వీరే చూసుకోవాల్సిన పరిస్థితులను కూటమి ప్రభుత్వ కల్పించింది.

నిధుల విడుదలిలా..

పాఠశాలలో 20 మందిలోపు విద్యార్థులుంటే ఏటా రూ.10 వేలు, 21 నుంచి 49 మందిలోపు ఉంటే రూ.15 వేలు, 50 నుంచి వంద మంది లోపు ఉంటే రూ.20 వేలు, 101 నుంచి 250 మందిలోపు ఉంటే రూ.50 వేలు, 251 నుంచి వెయ్యిలోపు విద్యార్థులుంటే రూ.75 వేలు, వెయ్యిపైన ఉంటే రూ.లక్ష వరకూ నిర్వహణ గ్రాంట్‌ను విడుదల చేస్తారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో నిధులను మంజూరు చేసేవారు.

చాలా కష్టం

ఇప్పటికే ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఒక్కొక్కరు రూ.4 వేలు నుంచి రూ.6 వేలకుపైగా ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. నిధులు ఎప్పుడు మంజూరవుతాయో తెలియక వారంతా ఆందోళన చెందుతున్నారు. ఇటీవల రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారే తప్ప ఇంకా ఆయా ఖాతాలకు జమ కాలేదని హెచ్‌ఎంలు చెబుతున్నారు.

నియోజకవర్గంలో స్కూళ్లు

మండలం	ఎంపీపీ	ఎంపీయూపీ	ఉన్నత
ఆత్మకూరు	56	6	13
ఏఎస్‌పేట	40	7	7
సంగం	43	7	7
చేజర్ల	43	6	6
మర్రిపాడు	72	7	10
అనంతసాగరం	56	6	9

నిధులు విడుదల కాలేదు

పాఠశాల నిర్వహణకు కాంపోజిట్ నిధులు మంజూరు కాని విషయం వాస్తవమే. ఇటీవల సంబంధిత మంత్రి ప్రకటించినా ఈరోజు వరకు నిధులు విడుదల కాలేదు. దీంతో పాఠశాలల హెచ్‌ఎంలే ఇప్పటి వరకు ఖర్చులు భరిస్తున్నారు.

– కె.చలపతి, ఆత్మకూరు ఎంఈఓ

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతుండడంతో బుధవారం టౌన్ ఫీడర్ పరిధిలో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సోమశిల: మండలంలోని శంకరనగరం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడుతూ పని దినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 150 మంది పనులకు హాజరయ్యారన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి స్వప్నారెడ్డి

సీతారామపురం: స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం అయోడిన్ లోపంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి స్వప్నారెడ్డి మాట్లాడుతూ జనాభాలో ఎంతోమంది అయోడిన్ లోపంతో బాధపడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ అయోడిన్ ఉప్పునే వాడాలన్నారు. అనంతరం వంట గదిలోని ఉప్పును పరిశీలించి నిర్వాహకులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదుపు వీఓఏలతో సమావేశం



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

వింజమూరు(ఉదయగిరి): స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం ఏపీఎం కృష్ణారావు వీఓఏలతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ నిధుల రికవరీపై దృష్టిపెట్టాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పేదరిక నిర్మూలనకు తమవంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీసీలు సుశీల, లక్ష్మీకుమారి, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

సంగం: కారు పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సంగం నుంచి ఆత్మకూరు వైపు నలుగురు ప్రయాణికులతో కారు బయలుదేరింది. ఏం జరిగిందో గానీ పెరమన పొలాల్లోకి ఒక్కసారిగా వాహనం దూసుకెళ్లింది. అందులోని మహిళలు, డ్రైవర్ ఒక్కసారిగా కేకలు వేశారు. నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పోలీసులకు సమాచారం లేదు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

సంగం: మండలంలోని ఉడ్‌హౌస్‌పేట సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ఎదురెదురుగా రెండు మోటార్‌బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడిన ఘటన మంగళవారం జరిగింది. సంగం ఎస్సై రాజేష్‌కు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆటోలో వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బాధితులు తరలివెళ్లారు.

సంగమేశ్వరస్వామి ఆలయంలో పూజలు

సంగం: సంగం త్రివేణి సంగమం ఒడ్డున ఉన్న కామాక్షి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న లలితా సహస్రనామ పారాయణం మంగళవారం ముగిసింది. మండలం రోజులుగా మహిళలు పారాయణం చేస్తున్న విషయం తెలిసిందే. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవదేవేరులకు అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన నిర్వహించి హోమం వేసి పూర్ణాహుతి వేశారు.

నేడో రేపో కూలే స్థితిలో..



వెన్నవాడ - డీసీపల్లి మధ్యలో సోమశిల ఉత్తర కాలువపై శిథిలావస్థకు చేరిన వంతెన

- ఉత్తర కాలువపై శిథిలావస్థకు చేరిన వంతెన
- మంత్రి స్పందించాలంటున్న జనం

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడ నుంచి 67వ నంబర్ జాతీయ రహదారికి ప్రజా రవాణా కోసం నాలుగు దశాబ్దాల క్రితం సోమశిల ఉత్తర కాలువపై వంతెన నిర్మించారు. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకుంది.

30 అడుగుల లోతులో ప్రవహిస్తున్న ఉత్తర కాలువపై అప్పట్లో వంతెన నిర్మించారు. దుత్తలూరు, వింజమూరు, ఆత్మకూరు మండలాల్లోని 30 గ్రామాలకు సంబంధించిన ప్రజలు, వ్యాపారులు, విద్యార్థుల రాకపోకలకు ఇది అత్యంత కీలకంగా ఉంది. దశాబ్ద కాలంగా చేపట్టు గోడలు దెబ్బతినడంతోపాటు శ్లాబుకు రంధ్రాలు పడ్డాయి. స్థానికులు మట్టితో రంధ్రాలను పూడుస్తూ తాత్కాలికంగా రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వర్షాకాలంలో వాహనాల రద్దీ కారణంగా మట్టి కొట్టుకుపోయి రంధ్రాలు బయట పడుతున్నాయి. దీంతో పది మీటర్ల పొడవున్న ఈ వంతెనపై ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. సోమశిల జలాశయం, ఉత్తర కాలువ 4వ డివిజన్ అధికారులు రెండేళ్ల క్రితం ఉత్తర కాలువ విస్తరణ పనుల్లో భాగంగా 45వ కిలోమీటర్ వరకు పనులు చేసి సరిపెట్టారు. ఈ పనుల్లో భాగంగా ఇదే వంతెనను రెండు లైన్లుగా విస్తరించి పునఃనిర్మిస్తామని అప్పట్లో పేర్కొన్నారు. తర్వాతి కాలంలో పట్టించుకోలేదు. ముప్పు వాటిల్లక ముందే ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

భూముల రీసర్వేపై గ్రామసభలు

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని నందిగుంటలో మంగళవారం భూముల రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సయ్యద్ హమీద్ మాట్లాడుతూ సమగ్ర భూసర్వేలో సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే వాటిని సరిచేస్తామని తెలిపారు. గ్రామంలో 2254.69 ఎకరాల విస్తీర్ణంలో గతంలో రీసర్వే జరిగిందని, వాటిలో అభ్యంతరాలు ఉంటే దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అధికారులకు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సర్వేయర్ రవికుమార్, ఎండోమెంట్ ఈఓ అనూష, రీసర్వే ఎండోమెంట్ ఇన్‌చార్జి కృష్ణ ప్రసాద్, వీఆర్వో రవితేజ తదితరులు పాల్గొన్నారు.

• **కలిగిరి:** మండలంలోని రావులకొల్లులో పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ చొప్పా రవీంద్రాబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ పద్మావతి, వీఆర్వో పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



కలిగిరి: సభలో అధికారులు, రైతులు

• **సోమశిల:** అనంతసాగరం మండలం పాతలపల్లిలో మంగళవారం గ్రామ సర్పంచ్ బిజివేముల ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన, తహసీల్దార్ వీరవసంత రావు ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. గ్రామస్తుల నుంచి రెవెన్యూ సమస్యలపై 40 అర్జీలు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు ప్రభాకర్, వెంకటరమణ, సర్వేయర్లు సురేష్, అమానుల్లా, సురేంద్ర పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

వరికుంటపాడు: పీఎం కిసాన్‌కు సంబంధించి సమస్యల పరిష్కారంలో భాగంగా మండలంలోని నల్లబోతులవారిపల్లిలో మంగళవారం ఏఓ రవికుమార్ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు తమ సమస్యలపై 83310 57231 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఆదిత్య, పవన్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

పేకాట స్థావరంపై దాడులు

కొండాపురం: మండలంలోని గొట్టిగుండాల గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై కొండాపురం ఎస్సై ఎం.వెంకట్రావ్ తన సిబ్బందితో మంగళవారం దాడులు నిర్వహించారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.1,300 నగదును స్వాధీనం చేసుకున్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ ఆదేశాలతో మంగళవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇటీవల చుంచులూరు గ్రామానికి చెందిన కొందరు ఈ భూమికి సంబంధించి తమకు పట్టా ఉందని, ప్రొద్దుటూరుకు చెందిన ఓ వ్యక్తికి రూ.17 లక్షలకు విక్రయించేందుకు ప్రయత్నించారు. రూ.2 లక్షలు అడ్వాన్స్ కూడా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు తహసీల్దార్ జె.స్వప్నకు ఫిర్యాదు చేయడంతో ఆమె సంబంధిత రికార్డులు పరిశీలించి ప్రభుత్వ భూమిగా గుర్తించారు. సిబ్బందిని ఆదేశించడంతో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఎలాంటి క్రయ విక్రయాలు జరిపేందుకు వీలు లేదని తెలిపారు.



బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

కోటితీర్థంలో పంటకోత ప్రయోగం

చేజర్ల: మండలంలోని కోటితీర్థం గ్రామంలో పంటకోత ప్రయోగాన్ని కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారి వి.శశిధర్ ఆధ్వర్యంలో ఓ రైతుకు చెందిన వరి పొలంలో నాణ్యంగా పండిన ప్రాంతాన్ని పరిశీలించి ప్రత్యేకంగా కోత కోశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వామల హసన్ కుమార్, గణాంకాధికారి భక్తవత్సలం, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డిప్యూటీ డీఈఓ



విద్యార్థినితో మాట్లాడుతున్న గోపాల్

అనుమసముద్రంపేట: ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కె.గోపాల్ మంగళవారం మండల కేంద్రమైన ఏఎస్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సిలబస్ ఎంత వరకు పూర్తి చేశారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోడల్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

వరికుంటపాడు: మండలంలోని అన్నీ రైతు సేవా కేంద్రాల పరిధిలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైందని మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్‌వీఎస్ రాఘవేంద్ర శర్మ తెలిపారు. ఆయన గ్రామ పశువైద్య సహాయకులకు స్థానిక వైద్యశాలలో సూచనలు, సలహాలు అందించారు. మొదటిరోజు సుమారు రెండువేల జీవాలకు మందు వేశారన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలోని కొత్తూరులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

మాతమ్మతల్లి గ్రామోత్సవం

సోమశిల: అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు గ్రామంలో మాతమ్మతల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. మాతమ్మతల్లికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని గ్రామస్తులు కోరారు.

సాగునీటి సంఘాలకు ఎన్నికలు

కావలి: కావలి డివిజన్ పరిధిలోని 154 చెరువులకు సంబంధించిన సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. కావలి మండలంలో 20, బోగోలులో 15, దగదర్తిలో 12, అల్లూరులో 5, జలదంకిలో 23, కలిగిరిలో 18, దుత్తలూరులో 12, వింజమూరులో 18, కొండాపురంలో 19, వరికుంటపాడు మండలంలో 12 చెరువులున్నాయి. ఈనెల 31వ తేదీ సాగునీటి సంఘాలకు పరిధిని నిర్ధారించనున్నారు. వచ్చేనెల 1, 2 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 3న పరిష్కాం చేసి పరిధిని ఫైనల్ చేయనున్నారు. 6 నుంచి 11వ తేదీ వరకు సాగునీటి సంఘాల పరిధిలో ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తారు. 21న ఎన్నికలు జరుగుతాయి.

ఘన నివాళి



ఆత్మకూరు: పట్టణంలోని ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫఖుల్లా ఖాన్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యస్దాని, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

• **సోమశిల:** మండల కేంద్రమైన అనంతసాగరంలో మంగళవారం అష్ఫఖుల్లా ఖాన్ జయంతిని ఆవాజ్ కమిటీ నాయకులు నిర్వహించారు. ఆ కమిటీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఇఫ్తికార్, షేక్ సలీం మాట్లాడారు. సుభానీ, అన్వర్ బాషా, కరీం, మస్తాన్, తన్వీర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

ఉదయగిరి: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ కోసం నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఉదయగిరి సాంఘిక సంక్షేమాధికారిణి ఆదిలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆగిన చేపల వేట

కావలి: తుఫాన్ ప్రభావంతో కావలి, బోగోలు, అల్లూరు మండలాల్లోని సముద్ర తీరంలో ఉన్న 30 మత్స్యకార గ్రామాలకు చెందిన వారు వేటను నిలిపివేశారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతోపాటు, వర్షాలు కురుస్తుండడంతో వేటకు వెళ్లడానికి ఎవరూ సాహసించడం లేదు. కాగా ఒడ్డుకు దూరంగా వలలు, తెప్పలు, ఇంజిన్ బోట్లను భద్రపరిచారు. అటుపోట్ల ప్రభావం బలంగా ఉండడం, సముద్రం బాగా లోపలికి వెళ్లడంతోపాటు, ఒడ్డున ఎత్తుగా ఇసుక మేట వేయడంతో మత్స్యకారులు వేటకు వెళ్లడానికి అవరోధంగా ఉంది. పది రోజులుగా చేపలు వేట లేక మత్స్యకార కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి.



ఒడ్డుకు దూరంగా చెట్ల వద్ద తెప్పలు

డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు

కావలి: పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో పోలీసులు మంగళవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ కొత్తగా మద్యం షాపు ఏర్పాటు చేశారు. ఆ రోడ్డులోనే టు టౌన్ పోలీస్‌స్టేషన్ ఉంది. డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టగా పోలీసుల్ని చూసి మందుబాబులు బైక్‌లను వెనక్కు తిప్పుకొని వెళ్లిపోయారు. కుటుంబాలతో వెళ్తున్న వారిని పోలీసులు ఆపడంతో మహిళలు అభ్యంతరం చెప్పారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు



ఉదయగిరి: ఆధార్ శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

అల్లూరు: అల్లూరు సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌లను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ కోరారు. స్థానిక అల్లూరు – 2, 3 పరిధిలో మంగళవారం ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

• **వింజమూరు(ఉదయగిరి):** మండలంలోని ఊటుకూరు, వింజమూరు సచివాలయం–2లో మంగళవారం ఆధార్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. పలువురు ఆధార్‌లో చేర్పులు, మార్పులు, ఫోన్ నంబర్లను అనుసంధానం చేశారు. కొంతమంది బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకున్నారు. నూతన ఆధార్‌కార్డులు పొందాల్సిన వారు కూడా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వీటిని మండలంలో 25వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఆధార్ సూపర్‌వైజర్లు అబ్దుల్‌బాషా, సునీల్ పాల్గొన్నారు.

• **కలిగిరి:** కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గిరిజనులకు నూరు శాతం ఆధార్ నమోదు కార్యక్రమం చేపడతామని ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో తానే స్వయం పర్యటించి ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు చేసుకునేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రహరీ ఉన్న ప్రతి పాఠశాలలో మొక్కలను నాటిస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ

రక్తదాతలు రియల్ హీరోలు

• ఆత్మకూరు డీఎస్పీ కె.వేణుగోపాల్



రక్తదానం చేసిన యువకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న డీఎస్పీ

ఆత్మకూరు: రక్తదానం చేసి ప్రాణాలు కాపాడేవారు సమాజంలో రియల్ హీరోలని ఆత్మకూరు డీఎస్పీ కె.వేణుగోపాల్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా ముందుకొచ్చి ఈ శిబిరంలో పాల్గొన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా రెడ్‌క్రాస్ అనుబంధ సంస్థ నోవా రక్తసేకరణ వారిచే సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, ఎస్సైలు ఎస్‌కే జిలానీ, సాయిప్రసాద్, వివిధ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు

చేజర్ల: వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో సబ్సిడీపై అందించేందుకు వరి, పచ్చిశనగ విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని చేజర్ల మండల వ్యవసాయ అధికారి వి.శశిధర్ తెలిపారు. మండలంలోని మడపల్లి, మాముడూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పట్టుపరిశ్రమ అధికారి మస్తాన్ పాల్గొన్నారు.

• **వరికుంటపాడు:** మండలంలోని తూర్పుబోయమడుగు, కాంచెరువు గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి వి.రవికుమార్ రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు.

• **మర్రిపాడు:** మండలంలోని అల్లంపాడు, చిన్నమాచనూరు గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి ఎస్.రామ్మోహన్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్లంపాడులో సాగులో ఉన్న మినుము ఎల్‌బీజీ – 932 రకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏ పవన్ కళ్యాణ్, ఏఎంహెచ్ మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

• **సీతారామపురం:** మండలంలోని నెమళ్లదిన్నె, గంగవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారి చెన్నారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆయన వెంట ఏఈఓ సాంబశివయ్య, వీఏహెచ్ శైలేంద్ర, ఏఎంసీ మార్కెట్ యార్డు అసిస్టెంట్ చిరంజీవి, రైతులున్నారు.

• **సోమశిల:** అనంతసాగరం మండలంలోని సోమశిల, పడమటికంభంపాడు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారి పి.శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కీర్తన, సుబ్బయ్య పాల్గొన్నారు.

• **ఉదయగిరి:** మండలంలోని కొండాయపాళెం, ఉదయగిరి పంచాయతీల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఏఓ ఆంజనేయులు నాయక్ మాట్లాడారు.